సాక్షి
అనంతపురం

శుక్రవారం ၊ 24 ၊ ఫిబ్రవరి ၊ 2023



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు, కనిష్టంగా 15 వేలు, సరాసరిన రూ.21 మేర ధర పలికాయి.



కిలో టమాట రూ.23

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
37.9°/13.8°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి, మధ్యాహ్నం ఎండ వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

పచ్చ పత్రికపై ప్రజాగ్రహం



కళ్యాణదుర్గంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, నాయకులు



రాయదుర్గంలో ఈనాడు ప్రతుల దహనం అనంతరం రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



బుక్కరాయసముద్రంలో నాయకులతో కలిసి ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

ఎప్పుడో రెండేళ్ల క్రితం తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ రెండు రోజుల క్రితం వేసేశారు. పాఠకులను వెర్రి వాళ్లను చేసేశారు. టీడీపీ నేత పట్టాభిని కొట్టలేదని పోలీసులు కోర్టులో చెబితే... వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ విషపు రాతలు రాసేశారు. సోషల్ మీడియాలో అబద్ధాలన్నీ తేటతెల్లమవడంతో తీరిగ్గా తేరుకుని తప్పైపోయిందంటూ నాలుక కరచుకున్నారు. జనాన్ని ఏదోలా బురిడీ కొట్టడమే లక్ష్యంగా కొన్ని రోజులుగా ఈనాడు రామోజీరావు రాస్తున్న దుర్మార్గపు రాతలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో గురువారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

- ఈనాడు ప్రతులు కాల్చి నిరసన
- రామోజీ రావు తీరును తప్పుబట్టిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- రెండేళ్ల క్రితం ఫొటోలు పెట్టడం దుర్మార్గమంటూ మండిపాటు
- ఎల్లో మీడియాను బహిష్కరించాలని నేతల పిలుపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఈనాడు 'కొట్టు' కథనంపై వైఎస్సార్ సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ప్రజలను తప్పుదోవ పట్టించిన రామోజీ రావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి కళ్యాణదుర్గంలో రహదారిపై ఈనాడు ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ మనుగడ కోసం రామోజీ రావు అభూత కల్పనలు రాస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వస్తున్న మద్దతు ఓర్వలేకే బురదజల్లే కార్యక్రమాన్ని ఎంచుకున్నారని విమర్శించారు.

పద్మశ్రీని వెనక్కి తీసుకోవాలి..

ఈనాడు అధినేత రామోజీరావుకు ఇచ్చిన పద్మశ్రీ అవార్డును కేంద్ర ప్రభుత్వం సత్వరం వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాయదుర్గంలోని వినాయక సర్కిల్‌లో రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీ బాష, పట్టణ కన్వీనర్ ముస్తక్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసుతో కలిసి ఈనాడు ప్రతులను ఆయన దహనం చేశారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ విలువల్లేని వ్యక్తులకు పద్మశ్రీ అవార్డులు అవసరం లేదన్నారు.

అబద్ధాలకు కేరాఫ్ రామోజీ..

అబద్ధపు రాతలకు కేరాఫ్ రామోజీరావు అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబ శివారెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని తాడిపత్రి–అనంతపురం రహదారిపై అంబేడ్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు దేనికి ఇంత దిగుజారుడు కథనాలు రాస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే కుట్రలకు తెరలేపారని విమర్శించారు. పచ్చపత్రికల కుయుక్తులను ప్రజలే తిప్పికొడతారని స్పష్టం చేశారు.

పచ్చపత్రికను బ్యాన్ చేయాలి..

తప్పుడు వార్తాకథనాలను ప్రచురించిన పచ్చ పత్రికను బ్యాన్ చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల రామాంజినేయులు, వార్డు సచివాలయాల గుంతకల్లు పట్టణ కన్వీనర్ ఎండీ ఖలీల్ డిమాండ్ చేశారు. గురువారం గుంతకల్లు పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో ఈనాడు ప్రతులను కాల్చిచేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈనాడుతో పాటు ఆంధ్రజ్యోతి, టీవీ5లను బహిష్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సుమోటోగా కేసు నమోదు చేయాలి..

కుట్రపూరిత కథనాలపై కోర్టులు జోక్యం చేసుకుని సుమోటోగా కేసులు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఈనాడు ప్రతులను దహనం చేశారు.

ఉరవకొండలో నిరసన..

ఈనాడు విషపురాతలపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉరవకొండలో ప్రజా ప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కవితా హోటల్ సర్కిల్ వద్ద ఈనాడు ప్రతులను కాల్చివేశారు.

న్యూస్‌రీల్

కనులపండువగా ఏకాంత సేవ



ఏకాంతోత్సవంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి

తాడిపత్రి టౌన్: బుగ్గరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం చివరిరోజు స్వామివారికి ఏకాంత సేవ కనులపండువగా నిర్వహించారు. పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ ఆవరణలో ఉయ్యాల్లో ఏకాంతోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సభ్యులు రాఘవేంద్రారెడ్డి, రమేష్, హరిప్రసాద్, భగీరథమ్మ, లక్ష్మీదేవి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా



అనంతపురం టౌన్: ఏసీ పరికరాలు ఉత్పత్తి చేసే 'డైకిన్' సంస్థలో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసిస్టెంట్ ఉద్యోగాల కోసం ఈ నెల 25న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. డిప్లొమా పూర్తి చేసి, 24 ఏళ్లలోపు వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని 'డైకిన్' ప్రతినిధి శివశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.13 వేల జీతంతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తామని, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని శ్రీసిటీలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో రావాలన్నారు.

పోలీస్ 'ఈవెంట్స్'కు ఉచిత శిక్షణ



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రిలిమినరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన కానిస్టేబుల్ అభ్యర్థులకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈవెంట్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 మీటర్లు, 1,600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌తో పాటు ఈవెంట్స్‌లో నిర్వహించే వాటికి సంబంధించిన శిక్షణ ఇస్తామన్నారు. ఇదివరకే పోలీసు ఉద్యోగుల పిల్లలకు పోలీసు లైబ్రరీ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ ఇచ్చామన్నారు. తాజాగా ప్రిలిమినరీ పరీక్షల్లో క్వాలిఫై అయిన ప్రతి అభ్యర్థికీ ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అనంతపురంలోని పోలీస్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్ కమ్ డిజిటల్ లైబ్రరీని (ఫోన్ నంబర్: 9392918225) సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 26 వ తేదీ సాయంత్రం 4 గంటలకు (ఆదివారం) పోలీస్ పరేడ్ మైదానంలో రియల్ టైం ఈవెంట్స్‌పై శిక్షణ ప్రారంభించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి

అనంతపురం: అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయాలని పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. మూడు రోజులు ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులనుద్దేశించి గురువారం వీడియో సందేశం పంపారు. తాను పాఠశాలలను తనిఖీ చేసినపుడు ఏ అంశాలను పరిశీలించేది స్పష్టంగా తెలియజేశారు. పూర్తయిన సిలబస్ ప్రకారం విద్యార్థులు నోట్ బుక్కులు రాసి ఉండాలని, వాటిపై ఉపాధ్యాయుల సంతకం ఉండాలన్నారు. మొక్కుబడిగా కాకుండా విద్యార్థులు రాసిన తప్పులను సరిదిద్దాలన్నారు. బైజూస్ ట్యాబ్స్ కచ్చితంగా ఉపయోగించాలన్నారు. ట్యాబ్‌లోని విషయాలు, వీడియోలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తాను అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో పాఠశాలల పరిశీలన సమయంలో అక్కడ డీఈఓ, ఎంఈఓలకు బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై అవగాహన లేదన్నారు. అయితే, శోభారాణి అనే ఎస్జీటీ సిలబస్ కవరేజీ, వర్క్ బుక్ కరెక్షన్ చాలా బాగా చేసినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. పాఠాలు చెప్పడం, నోటు పుస్తకాలు కరెక్షన్ చేయడం ఉపాధ్యాయుల దినచర్యలో భాగమని, తాను పాఠశాలల తనిఖీలో వాటినే పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు ఎందుకు ఒత్తిడికి లోనవుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

25న స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం: ఎస్కేయూ న్యాయ శాస్త్ర విభాగంలో మిగిలిన ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం సీట్లను ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. ఏపీ లాసెట్‌లో అర్హత సాధించి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులు పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు శ్రీవారి దర్శనం టికెట్ల విడుదల

అనంతపురం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలలో ఏప్రిల్, మే నెలకు సంబంధించిన శ్రీవారి అంగప్రదక్షిణ టికెట్ల బుకింగ్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి వస్తుందని టీటీడీ పండిట్ వేణు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మార్చి ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోటా ఉదయం 9 గంటలకు, మార్చి నెలకు సంబంధించిన కల్యాణోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ వర్చువల్ టికెట్లు సాయంత్రం 4 గంటలకు విడుదల చేస్తారన్నారు.

మహా మృత్యుంజయ హోమం రద్దు

అనంతపురం: ఎస్కే యూనివర్సిటీలో నిర్వహించాల్సిన మహా మృత్యుంజయ హోమాన్ని రద్దు చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనివార్య కారణాల రీత్యా శుక్రవారం యాగం నిర్వహించడం లేదన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రస్తుతానికి రద్దు చేశామన్నారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు యాగం నిలుపుదల చేసినట్లు తెలిసింది.

వైభవంగా సిద్ధేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం



రథోత్సవంలో వేలాదిగా పాల్గొన్న భక్తజనం

హేమావతి (అమరాపురం): హర హర మహాదేవ.. శంభో శంకర.. సిద్ధేశ్వర మహారాజ్‌కీ జై అన్న భక్తుల జయజయ ధ్వానాల మధ్య సిద్ధేశ్వరుని బ్రహ్మరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం నుంచే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పూలమాలలతో అలంకరించి మేళతాళాల మధ్య రథంపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం అశేష భక్తజన సమూహం మధ్య ఓం నమః శివాయా... సిద్ధేశ్వర స్వామి మహారాజ్‌కీ జై .. అంటూ భక్తులు రథోత్సవాన్ని ముందుకులాగారు. ఈ సందర్భంగా అరటి పండు, బెల్లం, కొబ్బరికాయ, పూలు, మిరియాలు తదితర వాటిని రథంపైకి విసిరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కర్ణాటక నుంచి వచ్చిన గురువులు చేసిన వీరగాసే నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలిరావడంతో హేమావతి గ్రామం కిటకిటలాడింది. తినుబండారాల దుకాణాలు, ఆటవస్తువుల అంగళ్లు కిక్కిరిసిపోయాయి. ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. అమెరికాలో స్థిరపడిన విజయలక్ష్మి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేశారు.

ముగిసిన నామినేషన్ ఘట్టం

- చివరి రోజున 47 సెట్ల దాఖలు
- నేడు నామినేషన్ల పరిశీలన



నామినేషన్ ప్రక్రియ గురించి ఎన్నికల పరిశీలకుడు పోలా భాస్కర్‌కు వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 16న ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. చివరి రోజున పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 33 సెట్ల నామినేషన్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 12 సెట్ల నామినేషన్లు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి 2 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజున స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎస్.మంగమ్మ ఒక సెట్టు వేశారు. యాడికి మండలం కొత్తపల్లికి చెందిన వేలూరు రంగయ్య ఆఖరు నిమిషంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి నామినేషన్ వేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీకి 94, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 29, స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి 4 మొత్తం 127 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు ఈనెల 27వ తేదీ వరకు గడువు ఇచ్చారు.

నామినేషన్ ప్రక్రియ పరిశీలన

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు పోలా భాస్కర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కె.సునీత, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు ప్రవీణ్ ప్రకాష్ గురువారం జిల్లాకు చేరుకుని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్ల గురించి వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ వివరించారు. ఇక బుక్కరాయసముద్రం, రాప్తాడు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు పోలా భాస్కర్ తనిఖీ చేశారు. కేంద్రాల ఏర్పాటు వివరాలను ఆయనకు ఆర్డీఓ మధుసూదన్ వివరించారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

రాప్తాడు: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అందరూ సమన్వయంతో కృషి చేయాలని కర్నూలు, కడప, అనంతపురం పట్టభద్రుల ఎన్నికల పరిశీలకుడు (ఐఏఎస్) పోలా భాస్కర్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మార్చి 13న నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా అసౌకర్యాలు కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో గదుల నిర్వహణ, పోలింగ్‌కు అనుకూలమైన వసతులు, తాగునీరు, విద్యుత్ తదితర వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, ఈడీటీ మల్లికార్జున, సర్వేయర్ రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

నామినేషన్ సెట్ల దాఖలు ఇలా...

తేదీ	పట్టభద్రులు	ఉపాధ్యాయ	స్థానిక సంస్థలు
16	1	1	0
17	5	1	0
20	6	1	0
21	16	3	0
22	33	11	2
23	33	12	2
మొత్తం	94	29	4

ధర్మవరం - గుత్తి మధ్య రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్

- రూ.636.38 కోట్లతో 90 కి.మీ డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తి
- పెరగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం



ధర్మవరం-గుత్తి మధ్య పూర్తయిన డబ్లింగ్, విద్యుదీకరణ పనులు

గుంతకల్లు: రైల్వే అభివృద్ధిలో మరో కీలక ఘట్టం పూర్తయింది. గుంతకల్లు డివిజన్‌లోని ధర్మవరం – గుత్తి రైలు మార్గంలోని కీలకమైన 90 కి.మీ డబుల్‌లైన్‌తో సహా విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగానే రైళ్ల రాకపోకలకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ తెలిపారు. ఈ రైలు మార్గం పూర్తి కావడంతో దక్షిణ భారతదేశం రాష్ట్రాలకు ఒక ప్రవేశ ద్వారంగా పనిచేస్తుందన్నారు. ఈ రైలు మార్గం రెండు తెలుగు రాష్ట్రాలకు, కర్ణాటక రాజధాని బెంగుళూరుతో పాటు అవతలి ప్రాంతానికి అనుసంధానించడంలో కీలకం కానుంది.

రూ.636.38 కోట్ల పనులు పూర్తి

ధర్మవరం-గుత్తి మధ్య డబ్లింగ్, విద్యుదీకరణ పనులను 2017 సంవత్సరంలో ప్రారంభించారు. మొత్తం 90 కి.మీల రైలు మార్గం పనులకు రూ.636.38 కోట్లు కేటాయించారు. ఈ పనులను రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ సంస్థ(రైట్స్)కు అప్పగించారు. దీంతో రైట్స్ సంస్థ దశవారీగా పనులు చేపట్టి తొలుత ఈ మార్గంలోని కల్లూరు–గార్లదిన్నె మధ్య 13 కి.మీల దూరం డబ్లింగ్, విద్యుదీకరణ పనులను 2019లో పూర్తిచేశారు. అనంతరం చిగిచెర్ల–జంగాలపల్లి మధ్య 11 కి.మీలను జూన్ 2020లో, గార్లదిన్నె–తాటిచెర్ల మధ్య 9 కి.మీలను నవంబర్ 2020లో పూర్తి చేశారు. అలాగే 2021 అక్టోబర్‌లో కల్లూరు–గుత్తి మధ్య 27 కి.మీ, అదేవిధంగా 2022 ఆగస్టు నెలలో తాటిచెర్ల–జంగాలపల్లి మధ్య 19 కి.మీ రైలు మార్గం పనులు పూర్తి చేశారు. చివరగా చిగిచెర్ల–ధర్మవరం మధ్య 11 కి.మీల మొత్తం పనులను ఈ ఏడాది ఫిబ్రవరిలో పూర్తిచేశారు. దీంతో మొత్తం 90 కి.మీల డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలే డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డితో పాటు జోనల్ అధికారులు చిగిచెర్ల–ధర్మవరం మధ్య పూర్తయిన పనులను పరిశీలించి రైళ్ల రాకపోకలు సాగించేందుకు అనుమతి కోరుతూ ఎస్‌సీఆర్ రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. గురువారం నుంచి 90 కి.మీ మధ్య రాకపోకలకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్.రాకేష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నైరుతి రైల్వే పరిధిలోని ధర్మవరం–బెంగళూరు డబ్లింగ్, విద్యుదీకరణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ మార్గంలో దశల వారీగా కొన్ని సెక్షన్‌లలో పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులు త్వరలో పూర్తి చేస్తారన్నారు.

పెరగనున్న రైళ్ల వేగం

ధర్మవరం–గుత్తి మధ్య 90 కి.మీ రైలు మార్గం ప్రాజెక్టు పూర్తికావడంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరగడంతో పాటు రద్దీ తగ్గనుంది. అంతేకాకుండా బెంగళూరు, ఆ తర్వాత సేష్టన్లకు ఎక్కువ సంఖ్యలో ప్యాసింజర్, గూడ్స్ రైళ్లను నడపడానికి ఎంతో దోహదపడనుంది. ముఖ్యంగా రైళ్ల సగటు వేగాన్ని మరింత పెంచడంలో సహాయపడనుంది. రైలు కనెక్టివిటీ అభివృద్ధితో అనంతపురం, కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు విజయవాడ, విశాఖపట్నం రాజధానులకు రాకపోకలు పెరగడంతో పాటు సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో విజయవంతమైన అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్, డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులను అభినందించారు.

క్లుప్తంగా

ఇల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన ఇల్లు

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని వృద్ధురాలు లక్ష్మీదేవికి చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వివరాలు... లక్ష్మీదేవి ఇద్దరు కొడుకులూ వ్యాపారరీత్యా బళ్లారిలో స్థిరపడ్డారు. దీంతో గ్రామంలోని మట్టి మిద్దెలో లక్ష్మీదేవి ఒక్కతే నివాసముంటోంది. కొన్ని రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఆమె బళ్లారికి వెళ్లింది. బుధవారం చీకటి పడుతున్న సమయంలో ఇరుగుపొరుగు వారు ఇళ్ల ముందు చెత్త ఊడ్చి నిప్పు రాజేశారు. ఆ సమయంలో నిప్పు రవ్వలు గాలికి ఎగిరి లక్ష్మీదేవి మిద్దెపై పడ్డాయి. విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు. రాత్రికి మిద్దెపై ఉన్న ఎండుగడ్డి తగులబడుతూ మంటలు చెక్క దూలాలకు వ్యాపించడంతో గురువారం ఉదయానికి ఇల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. విషయం తెలుసుకున్న లక్ష్మీదేవి బళ్లారి నుంచి తిరిగి వచ్చి కాలిపోయిన ఇంటిని చూసి బోరున విలపించింది. దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొంది.

ద్విచక్ర వాహనం అపహరణ

గుత్తి: స్థానిక ఈద్గా మైదానం ప్రాంతంలో నివాసముంటున్న అల్లాబకాష్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకెళ్లాడు. బుధవారం రాత్రి 10 గంటలకు ఇంటి ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం... గురువారం ఉదయం నిద్రలేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టుపక్కల విచారణ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ద్విచక్ర వాహనం చోరీ అయినట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవం.. జ్యోతుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పోతలయ్య స్వామి

కనగానపల్లి: పోతలయ్య స్వామి జాతరలో భాగంగా కనగానపల్లి మండలం దాదులూరు గురువారం జనసంద్రమైంది. ఈ సందర్భంగా ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవస్వాములను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేకపోతులను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పన్నేరు బండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు, 33 మంది ఏఎస్‌ఐలు, 43 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు మహిళా పోలీసులు, 32 మంది హోంగార్డులు బందోబస్తు నిర్వహించారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

నేడు గావుల ఉత్సవం

కాగా, దాదులూరు పోతలయ్య స్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన గావుల మహోత్సవాన్ని శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ పాలక మండలి చైర్మన్ రామలింగారెడ్డి గురువారం తెలిపారు.

జైళ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావు



వేలం పాట నిర్వహిస్తున్న ఐజీ శ్రీనివాసరావు, జైలు అధికారులు

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో జైళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని ఆ శాఖ ఐజీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బీకేఎస్ మండల పరిధిలోని సెంట్రల్ జైలు వద్ద ఉన్న ఓపెన్ ఎయిర్ కేంద్ర కారాగారంలో పశు సంపదపై గురువారం వేలం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జైళ్ల శాఖ ఐజీ మాట్లాడుతూ.. జైళ్ల ఆధునికీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. ఇందులో భాగంగానే ఆదాయ వనరుల ద్వారా నిధుల సమీకరించి జైళ్ల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఓపెన్ ఎయిర్ జైలులోని 23 ఆవులు, నాలుగు ఎద్దులు, మరో నాలుగు దున్నలను వేలం వేశారు. వీటి ద్వారా సమకూరిన రూ.5.87 లక్షల ఆదాయాన్ని ఖైదీల సంక్షేమ నిధిలో జమ చేయనున్నట్లు ఐజీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ రాహుల్, ఓపెన్ ఎయిర్ జైలు కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ చిన్నారావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ రెహమాన్; డాక్టర్ పెద్దన్న, జైలర్లు అచ్చినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గాడిదల సంరక్షణకు చర్యలు

పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వామి

బుక్కరాయసముద్రం: అంతరించి పోతున్న జంతువుల జాబితాలో చేరిన గాడిదల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (విజయవాడ) డాక్టర్ స్వామి పిలుపునిచ్చారు. గాడిదల సంరక్షణపై బీకేఎస్ మండలం రెడ్డిపల్లి ప్రాంతీయ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు న్యూఢిల్లీలోని బ్రూక్ ఇండియా ఆఫ్ హాస్పిటల్ వైద్యబృందంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అనిమల్ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్లు, జిల్లా సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ అనిమల్ (ఎస్‌పీసీఏ) మెంబర్స్, మెంబర్స్ అనిమల్ వెల్ఫేర్ ఆర్గనేజేషన్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోనూ గాడిదల సంతతి కనుమరుగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం రజక వృత్తిదారులకే కాకుండా సరుకు రవాణాలోనూ గాడిదలు ప్రముఖ పాత్ర వహించాయని గుర్తు చేశారు. మార్కెట్‌లో గాడిద పాలుకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. వివిధ రకాల మందుల తయారీలో వినియోగించే ఈ పాలు లీటర్ రూ.2,500తో అమ్ముడు పోతున్నట్లు తెలుస్తోందన్నారు. గాడిదల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిన నేపథ్యంలో వాటి సంరక్షణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన వైద్యాధికారులు డాక్టర్ సరితానేగి, గౌరీషా భరద్వాజ్, డాక్టర్ ప్రియాపాండే, కర్నూలు డీఏహెచ్‌ఓ డాక్టర్ రామచంద్రయ్య, అనంతపురం డాక్టర్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రత్నకుమార్, జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి విశ్రాంత పోలీస్ అధికారి



నాగార్జున గౌడ్‌కు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పెద్దవడుగూరు నివాసి నాగార్జున గౌడ్.. వైఎస్సార్‌సీపీలోకి చేరారు. గురువారం తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కలసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి పార్టీ కండువా కప్పి అభినందించారు. అనంతరం నాగార్జున గౌడ్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన చూసి ఆకర్షితుడైనట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి నేతృత్వంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అన్నింటా అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. దీంతో ఎమ్మెల్యేతో కలసి ప్రజలకు సేవలందించేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసి వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ప్రైవేట్ లైన్‌మెన్ మృతి



విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న మృతదేహం (ఇన్‌సెట్) నల్లప్ప (ఫైల్)

కళ్యాణదుర్గం: విద్యుత్ శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యానికి మరో ప్రైవేట్ లైన్‌మెన్ మృతి చెందాడు. ఫ్యూజ్ వేయడానికి స్తంభంపైకి ఎక్కిన యువకుడు.. షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు... కళ్యాణదుర్గం మండలం కాపర్లపల్లికి చెందిన గొల్ల నల్లప్ప (32)కు భార్య సరోజమ్మ, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. ప్రైవేట్ లైన్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం కాపర్లపల్లికి చెందిన ఓ రైతు పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజులు ఎగిరిపోయాయి. దీంతో ఫ్యూజులు వేసేందుకు నల్లప్ప సిద్ధమయ్యాడు. ఓటీ స్విచ్ ఆఫ్ చేసి స్తంభం పైకి ఎక్కి ఫ్యూజులు వేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురై స్తంభంపైనే వేలాడసాగాడు. విషయాన్ని గమనించిన రైతులు వెంటనే అధికారులను అప్రమత్తం చేయడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఈలోపు నల్లప్ప ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. సమాచారం అందుకున్న కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామ శివారులోని వేదవతి హగరి నది నుంచి ఇసుకను అక్రమంగా రాయదుర్గం పట్టణానికి టీడీపీ నేతలు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చీకటి పడిన తర్వాత సాగిస్తున్న ఈ అక్రమాలు పోలీసుల తనిఖీల్లో బట్టబయలైంది. వివరాలు... బుధవారం అర్ధరాత్రి నేత్రపల్లి సమీపంలో ఎస్‌ఐ సునీత, సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు అటుగా వచ్చాయి. దీంతో ట్రాక్టర్లను ఆపి రికార్డులు అడిగారు. తమ వద్ద ఎలాంటి రికార్డులు లేవని డ్రైవర్లు తెలపడంతో వాటిని ఎస్‌ఐ సునీత సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, సీజ్ చేసిన ట్రాక్టర్లు వై.గుండ్లపల్లికి చెందిన టీడీపీ నేత ధనుంజయ, నేత్రపల్లికి చెందిన టీడీపీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు హనుమంతుకు చెందినవి కావడం గమనార్హం.

విరుపాపల్లి వద్ద దారి దోపిడీ

బెళుగుప్ప: మండలంలోని విరుపాపల్లి సమీపంలోని జలదుర్గమ్మ గుడి వద్ద దుండగులు దారి కాచి వ్యక్తిని దోపిడీ చేశారు. వివరాలు.. శెట్టూరు మండలం మాలేపల్లి నివాసి గోవిందప్ప మొక్కజొన్న వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం విరుపాపల్లిలో మొక్కజొన్న కొనుగోలుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా జలదుర్గమ్మ గుడి వద్ద మాస్కులు, హెల్మెట్లు ధరించిన ఇద్దరు యువకులు అడ్డగించారు. తాము పోలీసులమంటూ పేర్కొని పలు రకాల ప్రశ్నలు వేస్తూ గోవిందప్పను గందరగోళానికి గురిచేస్తూ అతని వద్ద ఉన్న రూ.37,500 లాక్కొని ద్విచక్రవాహనంపై కళ్యాణదుర్గం వైపుగా ఉడాయించారు. బాధితుడి నుంచి సమాచారం అందుకున్న ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, బెళుగుప్ప ఎస్‌ఐ రామకృష్ణయ్య, ఏఎస్‌ఐ రామదాసు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

28న సంత మార్కెట్ వేలం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు సంత మార్కెట్ వేలంపాట నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న వేలంపాట నిర్వహించగా, నిర్దేశించిన సర్కారు సవాల్‌కు పాటదారులు ఆసక్తి చూపక పోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు: మండలంలోని జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ పుష్ప తెలిపారు. గురువారం మండలంలోని ఆత్మకూరు, పంపనూరు సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పనులకు సంబంధించి కూలి బిల్లులు రూ.250కు పైగా వస్తుందని తెలిపారు. జాబ్ కార్డు ఉన్న కూలీలకు సంబంధించి పని అడిగి ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలియజేశారు.

26న విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సమావేశం

అనంతపురం టౌన్: స్థానిక సంఘమేశ్వర సర్కిల్‌లోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 26న విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు వరదారెడ్డి, దేవదాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం 75 ఏళ్లు పూర్తయిన వారిని సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విశ్రాంత విద్యుత్ ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

మాక్‌డ్రిల్‌తో అవగాహన


అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్న డాక్టర్ స్వాతిలక్ష్మి

అనంతపురం సప్తగిరిసర్కిల్: వడియంపేటలోని హెచ్‌పీసీఎల్‌లో విపత్తు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్‌తో అవగాహన కల్పించారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల సిబ్బంది నేతృత్వంలో కార్యక్రమం చేపట్టారు. ప్రధానంగా ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో అందించే వైద్యంపై మాక్ డ్రిల్ కొనసాగింది. వివిధ శాఖల ఉద్యోగులకు వాటిని వివరించారు. డీసీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జాతీయ విపత్తు నియంత్రణ బలగాల వారు వారికి శిక్షణను అందించారు. కార్యక్రమంలో బీకేఎస్ మెడికల్ ఆఫీసర్ స్వాతి లక్ష్మి, జిల్లా ఎపిడమలజిస్ట్ వేణుగోపాల్, నారాయణరెడ్డి, 108 సిబ్బంది రామాంజనేయులు, మునిస్వామి పాల్గొన్నారు.

కోర్టు కేసులను తేలిగ్గా తీసుకోవద్దు

అనంతపురం క్రైం: కోర్టు కేసులను తేలిగ్గా తీసుకోవద్దని, ఎప్పటికప్పుడు ఆ కేసులకు సంబంధించిన వివరాల పక్కా సమాచారం సిద్ధంగా ఉండాలని కమిషనర్ కే భాగ్యలక్ష్మి టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడి బాధ్యతగా పని చేయాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ పనితీరుపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. నగరంలోని వివిధ భవనాల అతిక్రమణలపై చర్యలు ఏమి తీసుకున్నారని ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీని ప్రశ్నించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పినా..మీ పనితీరులో ఎలాంటి మార్పు రాలేదని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు అంజలి, మురళీలపై కమిషనర్ మండిపడ్డారు.

మురుగు సమస్య పరిష్కారం

అనంతపురం క్రైం: నగరంలోని 21వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో మురుగు సమస్యకు పరిష్కారం చూపేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. గురువారం అంబేడ్కర్‌నగర్‌లో కాలువ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా అంబేడ్కర్‌నగర్‌లోని మురుగు నడిమివంకలోకి కలిసేలా పనులు చేపట్టారు. స్థానికంగా నివాసముండే పలువురు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలితో అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. అంబేడ్కర్‌నగర్‌లోని ప్రజలందరినీ దృష్టిలో ఉంచుకొని పనులు చేస్తున్నామని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో సమస్య సద్దుమణిగింది. నగరపాలక సంస్థ అధికారుల వెంట స్థానిక కార్పొరేటర్ సాకే చంద్రలేఖ, వైఎస్సార్ సీపీ నాయకులు కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

అనంతపురం సప్తగిరి సర్కిల్: మైనార్టీల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తానని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించినందుకు మంత్రి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మండుటెండలో అదనపు కష్టాలు


సుభాష్‌రోడ్డులో పోస్టర్లు తొలగిస్తున్న నగరపాలక సంస్థ విద్యుత్ ఉద్యోగులు

నగర పాలక సంస్థల్లో పలు విభాగాలు ఉన్నాయి. ఆయా శాఖల సిబ్బంది, కార్మికులు వారికి కేటాయించిన పనులు చేయాల్సి ఉంది. అయితే నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. నగరంలోని సుభాష్‌రోడ్డులో డివైడర్లు, గోడలకు అతికించిన పోస్టర్లను ఎలక్ట్రీషియన్లతో తీసివేయించారు. వాస్తవంగా ఆ పనులను టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేయాలి. ఎలక్ట్రీషియన్లు వారి పనులు చేయడంతో పాటు అదనపు పనులు చేయించడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రీషియన్లతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పనులు చేయించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

– అనంతపురం క్రైం:


ఎండలోనూ పేపర్లు తొలగిస్తూ...

పైడి లక్ష్మయ్య రోడ్డు రాకపోకల పునరుద్ధరణ



అనంతపురం క్రైం: టవర్‌క్లాక్ నుంచి కోర్టు రోడ్డు మీదుగా రాకపోకలు పునరుద్ధరించారు. కోర్టురోడ్డు మార్గంలో నిర్మాణ పనుల్లో పనుల్లో భాగంగా కొన్ని రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఉండేది. కోర్టు రోడ్డు, రాంనగర్, కోవూర్‌నగర్, లక్ష్మీనగర్, బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్‌కు వెళ్లే వారు గుల్జార్‌పేట నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల బ్రిడ్జ్ కింది భాగంలో రోడ్డు పనులు పూర్తి కావడంతో పైడి లక్ష్మయ్య రోడ్డు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. వాహనదారులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సునాయాసంగా వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుతున్నారు. రోడ్డు పనులు వేగంగా పూర్తికావడంతో నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పంట నమోదుతో పలు ప్రయోజనాలు

రాప్తాడు: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ–క్రాప్ విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పాటు, పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ–క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి.

ఈక్రాప్ నమోదు ఇలా..

వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ–కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటల సాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాలు నమోదు. క్షేత్ర స్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ–కేవైసీ నమోదు చేయించాలి. ఇలా ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్ట పరిహారం, పంటల గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగుల మందులు తదితరాలు రాయితీపై అందుతాయి. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ–కేవైసీ కూడా చేయించుకోవాలి.

పంట నమోదు వివరాలు :

రాప్తాడు మండలంలో 11 రెవెన్యూ గ్రామాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 634 మంది రైతులు సుమారు


ఎం.చెర్లోపల్లిలో పంట నమోదు చేస్తున్న అధికారులు

2,240 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ప్రధానంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న ఇతర పంటలతోపాటు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. మండలంలో వ్యవసాయ శాఖ సిబ్బంది 95 శాతం ఈ–క్రాప్ నమోదులతో పాటు, ఈ–కేవైసీ పూర్తి చేశారు.ఈ నెల 28 వరకు అన్ని గ్రామాల్లో ఈ–క్రాఫ్‌తో పాటు ఈకేవైసీ ప్రక్రియ కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతులు త్వర పడాలి

పంటల నమోదు పక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నామని వ్యవసాయాధికారి శుభకర్ తెలిపారు. రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించి, రైతుల పొలం వద్దకే వెళ్లి పంటల వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. వ్యవసాయ సిబ్బంది పంట నమోదు చేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా రబీ పంట ఈకేవైసీ ఈ నెల 28వ తేదీలోపు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఈకేవైసీతో పాటు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలన్నారు.

ఆంజనేయ స్వామి మాన్యాన్ని కాపాడండి

రాప్తాడు: మాజీ నక్సలైట్ నుంచి ఆంజనేయ స్వామి మాన్యాన్ని కాపాడాలని హంపాపురం గ్రామస్తులు ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు, ఎస్ఐ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు గద్దె కేశవరెడ్డి, తలారి సింగారప్ప, వెంకటనారాయణ, రాజారెడ్డి, చుక్కా సంజీవరాయుడు, సొసైటీ రవి తదితరులు మాట్లాడారు. మండలంలోని హంపాపురంలో సర్వే నంబర్ 226–1లో 3–36 ఎకరాల భూమి పూర్వం నుంచి యలమకూరి ఆంజనేయ స్వామి పేరున ఉందన్నారు. ఈభూమిని గ్రామస్తులు సాగు చేసుకొని ఆలయానికి కౌలు ఇచ్చేవారన్నారు. 15 ఏళ్ల నుంచి పంటలు సరిగ్గా పండక గ్రామంలో రైతులెవరూ స్వామి పొలాన్ని కౌలుకు తీసుకోలేదన్నారు. అప్పటి నుంచి ఆ పొలం గురించి ఎవరూ పట్టించుకోలేదన్నారు. రెవెన్యూ రికార్డుల్లో దేవుడి మాన్యాన్ని తొలగించి, ప్రభుత్వ భూమిగా కనబరుస్తూ 2007లో కూడేరు మండలానికి చెందిన మాజీ నక్సలైట్ నాగరాజు అలియాస్ యల్లన్న తన భార్య పేరున పట్టాతెచ్చుకున్నట్లు తెలిపారు. అప్పట్లో మాజీ నక్సలైట్ పొలం దగ్గరకు వస్తే గ్రామస్తులు అతనిపై దాడికి దిగడంతో ఊరు వదిలి వెళ్లిపోయాడన్నారు. మళ్లీ మాజీ నక్సలైట్ నాగరాజు ఆలయ పూజారి విశ్వనాథ్ ఆ భూమి తనకే చెందుతుందని బెదిరిస్తున్నాడని తెలిపారు. మాజీ నక్సలైట్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ ఆంజనేయులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగన్‌మోహన్‌నాయుడు, రామాంజనేయులు, జయచంద్ర, చిన్న కదిరయ్య, మల్లికార్జున , వీరప్ప, శివయ్య, అశ్వర్థ నారాయణ, పూజారి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మాధవరాజులకు పూజలు

ఆత్మకూరు: మండలంలోని సనపకు చెందిన మాధవరాజుల స్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి విగ్రహాన్ని పూలమాలలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లి ప్రదక్షిణలు చేయించారు. సనప మాధవరాజుల స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పెద్ద ఎత్తున రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు :

సనపలో ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 25న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆధ్వర్యంలో జనరల్ విభాగంలో పెద్ద ఎత్తున రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. రాతిదూలం పోటీల్లో మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు అందించనున్నారు.

వైద్యుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భోగే హరీష్‌కుమార్‌రెడ్డి

రాప్తాడురూరల్: వైద్యుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భోగే హరీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానన్నారు. ఈ మేరకు గురువారం రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసిన డాక్టర్ హరీష్ పూల బొకే అందజేసి, శాలువాతో సన్మానించారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులందరినీ కలుపుకొని పోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి విభాగం రాయలసీమ యూనివర్సిటీల అధ్యక్షుడు జీవీ లింగారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్, అనిల్, తేజేశ్వరరెడ్డి, నితిన్‌రెడ్డి, రమష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి బొకే అందిస్తున్న డాక్టర్ హరీష్‌కుమార్‌రెడ్డి

బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట

- రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న

అనంతపురం సప్తగిరి సర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేశారని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న స్పష్టం చేశారు. గురువారం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రజకులకు నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రజకులకు సంబంధించి 14 డిమాండ్లను ఆయనకు విన్నవించామన్నారు. వాటిని ఆయన పరిశీలించి, రజకులకు అందించేందుకు చొరవ చూపుతున్నారన్నారు. వీటి ద్వారా రజకుల స్థితిగతులే పూర్తిగా మారిపోతాయన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని తీసేయాలనే కుట్రలో భాగంగా బీసీలను విడగొట్టి రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో ఎల్లో మీడియా, సోషల్ మీడియాలో ఇష్టారాజ్యంగా రాయిస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు, తప్పుడు కథనాలను ప్రజలు నమ్మొద్దని ఆయన హితవు పలికారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన చేస్తున్న సుభిక్ష పాలన ఎంతో ఆదర్శనీయమన్నారు. ప్రజా సంక్షేమాన్ని అందించాలని, నాడు ప్రజా సంకల్ప పాదయాత్ర పేరుతో 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేసి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారన్నారు. వాటికి అనుగుణంగా తాను అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశారన్నారు. దీంతో ప్రజలకు మంచి చేసే పాలకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. వీటిని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, రజక సంఘం నాయకులు చంద్రశేఖర్, సురేష్, ఆదెప్ప, రఘు, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న

ఏకాగ్రతతో చదవితే లక్ష్యం సాధిస్తాం


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ నరసింహారెడ్డి

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో చదివితే లక్ష్యం సాధించొచ్చని ఎంఈఓ నరసింహారెడ్డి పదో తరగతి విద్యార్థులకు తెలిపారు. గురువారం మండలంలోని సనప, ఆత్మకూరు, తలుపూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు స్టడీ అవర్స్‌తోపాటు ఒక్కో సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించి, చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రతి సెమిస్టర్‌కూ స్పెషల్ ఫీజు పెంపుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ కళాశాలలోని పీజీ కోర్సులకు ప్రతి సెమిస్టర్‌కూ స్పెషల్ ఫీజులు పెంచుతున్నారని ఏఐఎస్ఏ వర్సిటీ కార్యదర్శి రాజునాయక్ ఓ ప్రకటనలో అన్నారు. ఉన్నత విద్యామండలి నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు పెంపుదల చేస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. హాస్టల్ బకాయిలు సైతం 10 రోజుల్లోనే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ


నగదు అందజేస్తున్న విజయ డెయిరీ సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పాడి రైతులకు రూ.6,94,000 బోనస్‌గా అందించినట్లు విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల కేంద్రంలోని విజయ డెయిరీ కార్యాలయం వద్ద 600 మందికి 3,47,000 లీటర్లకు లీటరుకు రూ.2 చొప్పున బోనస్ కింద రూ.6,94,000 రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా విజయ డెయిరీ సేవలందిస్తోందన్నారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన బోనస్‌ను రైతులకు అందించామన్నారు. ప్రైవేట్ డెయిరీల పోటీ ఎక్కువగా ఉన్నా ఇటు పాల ఉత్పత్తిదారులు విజయ డెయిరీని ఆదరిస్తున్నారన్నారు. విజయ డెయిరీ లాభాల బాట పట్టడానికి దోహదపడిన ఉద్యోగులు, కార్మికులకు కూడా త్వరలో రూ.2,20 కోట్ల బోనస్‌ను అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ పరమేశ్వరరెడ్డి, డీడీ రాజేష్, బీఎంసీసీ మేనేజర్ తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: దామాజిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, సీఈఓ నరసరాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 15లోపు రెన్యూవల్ చేసుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు.

పంచాయతీ స్థలాలపై ‘రియల్’కన్ను

- రూ.కోట్ల విలువైన పంచాయతీ భూమి కబ్జాకు యత్నం

అనంతపురం రూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెట్రేగిపోతున్నారు. రూ.కోట్ల విలువైన పంచాయతీ భూమి కబ్జాకు యత్నించారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రజాప్రయోజనాల కోసం వదిలిన ఓపెన్ స్థలాలను సైతం ఆక్రమించుకోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగిస్తున్నారు. కురుగుంట రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 108, 109–1–2ఏ, 2బీలో దాదాపు 25 ఏళ్ల క్రితం 22 ఎకరాల్లో చంద్రప్రియనగర్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో పంచాయతీ నిబంధనల ప్రకారం 22 ఎకరాలకు గాను ప్రజా ప్రయోజాల కోసం 2. 20 ఎకరాల భూమిని కేటాయించారు. అయితే అక్కడ ప్రస్తుతం సెంటు భూమి ధర రూ. 8లక్షల నుంచి రూ.10 లక్షలు పలుకుతుంది. దీంతో ఆ భూమిపై కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. ఎలాగైనా ఆ భూమిని ఆక్రమించుకొని అమ్మేయాలని అనుకుంటున్నారు. వెంచర్ ఏర్పాటు చేసిన వ్యక్తి మరణించడంతో అతని కుమారుడితో పాటు మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగంలోకి దిగి ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు.


ఓపెన్ స్థలాన్ని చదును చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

ఇటీవల ప్లాట్లు వేశారు :

రెండు రోజుల క్రితం ఆ భూమిని జేసీబీలతో చదును చేసి, ప్లాట్లు వేయడానికి ప్రయత్నిస్తున్నారు. చాలా చోట్ల ఓపెన్ స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకున్నా అధికారులు పట్టించుకోలేదు. చంద్రప్రియనగర్ ఓపెన్ స్థలంలో ఇప్పటికే రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచుకోవడానికి గోడౌన్ కూడా నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారుల స్పందించి పంచాయతీ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పంచాయతీ స్థలంలో నిర్మిస్తున్నహార్టికల్చర్ భవనం

పబ్లిక్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన పబ్లిక్ స్థలాలను ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు. పంచాయతీకి చెందిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు. త్వరలోనే సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం.

– ప్రభాకర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి